సాక్షి
అన్నమయ్య జిల్లా
శనివారం। 13। జనవరి। 2024



హ్యాండ్ బాల్ పోటీలు ప్రారంభం

రాజంపేట మండలం తాళ్ళపాక రోడ్డులోని శాన్వీ ఇంటర్నేషనల్ పాఠశాలలో 45వ రాష్ట్ర స్థాయి బాలికల అండర్-19 హ్యాండ్ బాల్ పోటీలు శుక్రవారం ప్రారంభమయ్యాయి. -8లో



పండుగకు వెళ్తూ.. పైలోకాలకు..

పెళ్లయిన ఆరు నెలలకే నవదంపతుల జీవితం అర్ధాంతరంగా ముగిసింది. వారు పండుగకు వెళ్తూ రోడ్డు ప్రమాదంలో మృత్యువాత పడ్డారు. -8లో

మదనపల్లె : టమాటా ధరలు (10 కిలోలు)

	కనిష్టం	గరిష్టం
మొదటిరకం	రూ.190	రూ.260
రెండోరకం	రూ.100	రూ.186



మార్కెట్‌కు వచ్చిన మొత్తం సరుకు : 117 మెట్రిక్ టన్నులు

పట్టుగూళ్ల ధరలు (రూ.లో)

రకం	కనిష్టం	గరిష్టం
బైవోల్టిన్	390	482
సీబీ	-	-



మార్కెట్‌కు వచ్చిన పట్టుగూళ్లు: 1111.700 కిలోలు

న్యూస్‌రీల్

రేపు పుష్పగిరిలో గోదా కల్యాణం

వల్లూరు: ప్రముఖ పుణ్య క్షేత్రంగా వెలుగొందుతున్న పుష్పగిరిలో భోగి పండుగ నాడైన ఆదివారం గోదాదేవి కల్యాణం జరుగుతుందని ఆలయ అనువంశిక ధర్మకర్త దుగ్గిరెడ్డి వెంకట సుబ్బారెడ్డి, ప్రధాన అర్చకులు అఖిల్ దీక్షితులు ఒక సంయుక్త ప్రకటనలో తెలిపారు. కొండపైన గల శ్రీ లక్ష్మీ చెన్న కేశవ స్వామి ఆలయంలో తెల్లవారుజామున 5 గంటలకు స్వామివారికి బిందె తీర్థ సేవ, సహస్ర నామార్చన, ధనుర్మాస ఆరాధన జరుగుతాయని తెలిపారు. ప్రత్యేక పూజల అనంతరం ఉదయం 10 గంటలకు గోదా దేవి కల్యాణోత్సవం జరుగుతుందన్నారు. మధ్యాహ్నం అన్నదానం జరుగుతుందని తెలిపారు.

పారదర్శకంగా కాంట్రాక్ట్ ఉద్యోగుల క్రమబద్ధీకరణ

కడప రూరల్: కాంట్రాక్ట్ ఉద్యోగుల క్రమబద్ధీకరణ పారదర్శకంగా జరుగుతుంది. ఎవరైనా ప్రలోభాలకు గురి చేస్తే నమ్మవద్దని జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ నాగరాజు తెలిపారు. వైద్య ఆరోగ్య శాఖలో 2014 ముందు నుంచి వివిధ కేటగిరీలకు చెందిన కాంట్రాక్ట్ ఉద్యోగులు పనిచేస్తున్నట్లు పేర్కొన్నారు. నిబంధనల మేరకు వారిని శాశ్వత ప్రాతిపదికన క్రమబద్ధీకరించే ప్రక్రియ జరుగుతోందన్నారు.

దరఖాస్తుల ఆహ్వానం

కడప స్పోర్ట్స్: కల్నల్ మద్రాసు ఇంజినీరింగ్ గ్రూపు అండ్ సెంటర్ బెంగుళూరు ఆధ్వర్యంలో నిర్వహించే 'ఆర్మీ బాలుర క్రీడా కంపెనీ'లో ప్రవేశాలకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు జిల్లా క్రీడల అభివృద్ధి అధికారి కె. జగన్నాథ రెడ్డి తెలిపారు. జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో పతకాలు సాధించిన 14 నుంచి 16 సంవత్సరాలలోపు వయసు కలిగిన బాలుర క్రీడాకారులు ఈ ఎంపికలకు అర్హులన్నారు. ఫిబ్రవరి 5 నుంచి 8వ తేదీ వరకు కేంద్రీయ విద్యాలయం, మద్రాసు ఇంజినీరింగ్ సెంటర్, బెంగుళూరు గ్రౌండ్‌లో ఎంపికలు జరుగుతాయన్నారు. బాక్సింగ్, హాకీ, సెయిలింగ్, స్విమ్మింగ్ క్రీడాంశాల్లో ప్రవేశాలు నిర్వహించనున్నట్లు తెలిపారు.

మరోసారి..

మైనారిటీలకు అందలం

వైఎస్సార్ సీపీ మదనపల్లె సమన్వయకర్తగా నిస్సార్ అహ్మద్



సీఎం వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డి, ఎంపీ మిథున్‌రెడ్డితో మదనపల్లె సమన్వయకర్త నిసార్‌అహ్మద్

మదనపల్లె: వైఎస్సార్ సీపీలో మైనారిటీలకు ప్రాధాన్యత ఉంటుందనే విషయం మరోసారి రుజువైంది. విద్యావంతుడు, వివాదరహితుడిగా పేరున్న నిసార్ అహ్మద్‌ను వైఎస్సార్ సీపీ మదనపల్లె సమన్వయకర్తగా ప్రకటించింది. ఆయన నియామకంపై నియోజకవర్గంలోని మైనారిటీలు, వైఎస్సార్ సీపీ నాయకులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. 2019 ఎన్నికల్లో ఉమ్మడి చిత్తూరు జిల్లాలోని 14 నియోజకవర్గాల్లో టీడీపీ మైనారిటీలకు మొండిచేయి చూపించింది. వైఎస్సార్ సీపీలో మదనపల్లె శాసనసభ అభ్యర్థిగా మైనారిటీ వర్గానికి చెందిన నవాజ్‌బాషాను ఎంపికచేసి, నియోజకవర్గ చరిత్రలో ఇప్పటివరకు మరే ఎమ్మెల్యేకి రానంత మెజారిటీతో గెలుపును కైవసం చేసుకుంది. తిరిగి అదే సంప్రదాయాన్ని కొనసాగిస్తూ, మరోసారి మైనారిటీలకు సముచిత స్థానం కల్పిస్తూ చర్యలు తీసుకుంది. మైనారిటీల్లో మంచిపేరున్న కుటుంబానికి చెందిన నిసార్ అహ్మద్‌ను సమన్వయకర్తగా నియమించింది. పట్టణంలోని బెంగళూరు బస్టాండు సమీపంలోని జామియామసీదుకు చాలా కాలం పాటు నిసార్ అహ్మద్ తండ్రి హాజీ ప్యారేజాన్ పెద్దగా వ్యవహరించారు. సివిల్ ఇంజినీరింగ్ పట్టభద్రుడైన నిసార్‌అహ్మద్ విద్యాభ్యాసం ప్రాథమిక స్థాయి నుంచి ఇంటర్మీడియట్ వరకు మదనపల్లెలో కొనసాగింది. బెంగళూరు యూనివర్సిటీ నుంచి ఇంజినీరింగ్ పూర్తిచేసిన ఆయన మదనపల్లె సబ్‌డివిజన్‌లో పంచాయతీరాజ్‌శాఖలో అసిస్టెంట్ ఇంజనీర్‌గా మూడుదశాబ్దాలు వివిధ మండలాల్లో బాధ్యతలు నిర్వర్తించారు. విధి నిర్వహణలో వివాదరహితుడుగా గుర్తింపు పొందారు. ఈయనకు ఇద్దరు కుమారులు, ఇద్దరు కుమార్తెలు. నలుగురు పిల్లలు ఎంబీబీఎస్ పూర్తిచేసి డెర్మటాలజీ, ఆప్తాల్మజీ, జనరల్ మెడిసిన్‌లో ఎండీ కోర్సు చదువుతున్నారు. వీరి కుటుంబం వైఎస్.రాజారెడ్డి, మహానేత వైఎస్.రాజశేఖర్ రెడ్డి కుటుంబానికి సుపరిచితులుగా పేరు ఉంది. మదనపల్లెకు వారు వచ్చినప్పుడు నిసార్‌అహ్మద్ ఇంటిలో విడిది చేశారు. వీరి కుటుంబానికి పట్టణంలో మంచిపేరుతో పాటు సీఎం జగన్‌మోహన్‌రెడ్డి, పెద్దిరెడ్డి కుటుంబానికి విధేయులన్న గుర్తింపు ఉంది. 2014, 2019 ఎన్నికల్లో మదనపల్లె ఎమ్మెల్యే అభ్యర్థిత్వానికి మైనారిటీ కోటాలో నిసార్ అహ్మద్ పేరు వినిపించినప్పటికీ అవకాశం వరించలేదు. అయినా పార్టీని నమ్ముకుని, ఎప్పటికైనా తనకు అవకాశం లభిస్తుందని వేచి చూస్తుండగా, ఎట్టకేలకు 2024లో అదృష్టం వరించింది. మదనపల్లె వైఎస్సార్ సీపీ సమన్వయకర్తగా నిస్సార్ అహ్మద్ ఎంపికపై గురువారం రాత్రి వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు బెంగళూరుబస్టాండులో టపాకాయలు పేల్చి సంబరాలు చేసుకున్నారు. శుక్రవారం హిందూపురం పర్యటనలో ఉన్న అటవీ, విద్యుత్, భూగర్భగనులశాఖ మంత్రి పెద్దిరెడ్డిరామచంద్రారెడ్డిని కలిసిన నిసార్‌అహ్మద్ మదనపల్లె సమన్వయకర్తగా ప్రకటించినందుకు కృతజ్ఞతలు తెలిపారు.

అందరి మన్ననలు పొందుతా..

నియోజకవర్గంలో ప్రజలందరినీ ప్రత్యక్షంగా కలిసి వారి మన్ననలు పొందుతా. ఇప్పటివరకు నియోజకవర్గంలో జరిగిన అభివృద్ధి, సంక్షేమంపై ప్రజలకు వివరించేందుకు గ్రామాల్లో పర్యటిస్తాను. సీఎం వైఎస్.జగన్ మోహన్‌రెడ్డి, ఎంపీ మిథున్‌రెడ్డి నాపై నమ్మకాన్ని ఉంచి నియోజకవర్గ సమన్వయకర్తగా నియమించారు. వారి నమ్మకాన్ని నిలుపుకుని, పార్టీని అధికారంలోకి తెచ్చేందుకు కృషిచేస్తాను. – నిసార్ అహ్మద్, మదనపల్లె వైఎస్సార్ సీపీ సమన్వయకర్త

'కొత్త(పేట) కలాల'కు పురస్కారం

ప్రొద్దుటూరు: పట్టణానికి చెందిన కేంద్ర సాహిత్య అకాడమి అవార్డు గ్రహీత డీకే చదువుల బాబు శిక్షణ, సంపాదకత్వంలో కొత్త పాఠశాల విద్యార్థులు రాసిన 'కొత్తపేట కలాలు' బాలల కథల పుస్తకానికి ప్రతిభా పురస్కారం లభించింది. తెలంగాణ రాష్ట్రం రాజన్న సిరిసిల్ల జిల్లా ముస్తాబాద్‌కు చెందిన డాక్టర్ చింతోజు బ్రహ్మయ్య బాలామణి ప్రతిభా పురస్కారానికి న్యాయనిర్ణేతల మండలి ఈ పుస్తకాన్ని ఎంపిక చేసిందని డీకే చదువుల బాబు శుక్రవారం తెలిపారు. ప్రతిభగల బాలలకు కథారచనలో శిక్షణ ఇచ్చి 2020లో వారు రాసిన కథలతో ఈ పుస్తకాన్ని ప్రచురించినట్లు చెప్పారు.

25లోగా పోలింగ్ కేంద్రాల్లో సౌకర్యాలు కల్పించాలి

జిల్లా కలెక్టర్ గిరీషా పీఎస్



రాయచోటి: జిల్లా వ్యాప్తంగా ఉన్న అన్ని పోలింగ్ కేంద్రాల్లో ఈ నెల 25వ తేదీలోగా వంద శాతం కనీస సౌకర్యాలు కల్పించాలని జిల్లా కలెక్టర్ గిరీషా పీఎస్ సంబంధిత అధికారులను ఆదేశించారు. శుక్రవారం కలెక్టరేట్‌లో ఎన్నికల నిర్వహణపై నియోజకవర్గ ఈఆర్‌ఓలు, ఆర్ డబ్ల్యూఎస్, స్కూల్ అండ్ కాలేజ్ ఎడ్యుకేషన్, పంచాయతీ రాజ్, విద్యుత్, ఆర్ అండ్ బీ శాఖల అధికారులతో కలెక్టర్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో 1607 పోలింగ్ కేంద్రాలు ఉన్నాయన్నారు. ఎన్నికల కమిషన్ మార్గదర్శకాల మేరకు పోలింగ్ కేంద్రాల్లో కనీస సౌకర్యాలైన ర్యాంపు, తాగునీరు, నీటివసతితో కూడిన మరుగుదొడ్డి, ఫర్నీచర్, విద్యుత్ సౌకర్యం, లైటింగ్ పరికరాలు తప్పనిసరిగా ఉండాలన్నారు. ఇందులో ఈఆర్‌ఓలు ఇచ్చిన నివేదిక మేరకు ఆయా నియోజకవర్గాల్లోని పోలింగ్ కేంద్రాల్లో ర్యాంపులు 259, తాగునీరు 87, నీటివసతితో మరుగుదొడ్లు 118, ఫర్నీచర్ ఏర్పాటు 204, విద్యుత్ సౌకర్యం 64, లైటింగ్ పరికరాలు 83 పీఎస్‌లలో ఏర్పాటు చేయాల్సి ఉందన్నారు. ఈఆర్‌ఓలు, ఆయా శాఖల అధికారులు సమన్వయంతో కృషి చేసి ఈ నెల 25లోగా ఏర్పాట్లను పూర్తి చేయాలన్నారు. సమావేశంలో జాయింట్ కలెక్టర్ ఫర్మన్ అహ్మద్‌ఖాన్, డీఆర్‌ఓ సత్యనారాయణ, ఆర్డీఓలు రంగస్వామి, మురళి, రామకృష్ణారెడ్డి, పీలేరు, తంబళ్లపల్లె, కోడూరు ఈఆర్‌ఓలు గోపాలకృష్ణ, రాఘవేంద్ర, మల్లికార్జునరెడ్డి, ఆర్‌డబ్ల్యూఎస్ ఎస్‌ఈ ప్రసన్నకుమార్, డీఈఓ శ్రీరామ్‌పురుషోత్తం, పీఆర్ ఎస్‌ఈ దయాకర్‌రెడ్డి, ఎస్ఎస్ఏ జిల్లా కోఆర్డినేటర్ కరుణాకర్, ఇంటర్మీడియట్ ఆర్ఐఓ కృష్ణయ్య, విద్యుత్, ఆర్ అండ్ బీ డీఈలు చంద్రశేఖర్‌రెడ్డి, సహదేవరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఎక్కడి నుంచైనా ఎంప్లాయిమెంట్ నమోదు చేసుకోవచ్చు

రాయచోటి టౌన్: రాష్ట్రంలో ఎక్కడి నుంచైనా సరే నిరుద్యోగులు ఎంప్లాయిమెంట్ నమోదు చేసుకోవచ్చని జిల్లా కలెక్టర్ గిరీషా పీఎస్ తెలిపారు. గురువారం కలెక్టర్ కార్యాయలంలో జిల్లా ఉపాధి కల్పనాధికారి ఏ. సురేష్ కుమార్‌తో కలసి కరపత్రాలను విడుదల చేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలోని అన్ని జిల్లాలకు చెందిన ఎంప్లాయిమెంట్ ఎక్స్ఛేంజీలు / మోడల్ కేరీర్ సెంటర్‌ల ద్వారా అందించే సేవలను భారత ప్రభుత్వ నేషనల్ కేరీర్ సర్వీస్ (ఎన్‌సీఎస్) పోర్టల్‌తో ఆన్‌లైన్‌లో అనుసంధానించినట్లు చెప్పారు. ఈ ఆన్‌లైన్ సేవలు (ఎంప్లాయిమెంట్ రిజిస్ట్రేషన్, రెన్యువల్, అదనపు అర్హతల నమోదు) సులభతీరిన ఎంప్లాయిమెంట్ డాట్ ఏపీ డాట్ జీవీఓ డాట్ ఇన్ ద్వారా అందిస్తున్నామన్నారు.


అయ్యగారికి దండం పెట్టు..



బసవన్నను తీసుకెళుతున్న గంగిరెద్దులోళ్లు

తొలి కోడిని తామే మేల్కొలిపి.. వణుకు పుట్టించే చలిని పక్కకు నెట్టి.. సన్నాయి మేళం..బసవన్నల తాళంతో ఊరంతటినీ నిద్రలేపి గంగిరెద్దులు ఆడించేవారు ధనురాస్మానికి నిండుదనాన్ని తెస్తారు. ' అయ్యగారికి దండం పెట్టు... అమ్మగారికి దండం పెట్టు..' అంటూ విస్తుగొలిపే విన్యాసాలు చేస్తూ సంక్రాంతి సందడి సృష్టిస్తారు. ఏటా పెద్ద పండక్కి వచ్చి.. మహాశివరాత్రి వరకు ఉంటారు. వీరు గుంటూరు జిల్లా వినుకొండ పంచాయతీ ఉప్పరపాళెం గ్రామానికి చెందిన వారు. మిగతా సమయాల్లో వ్యవసాయ పనులు చేసుకుంటూ జీవించే వీరంతా ధనురాస్మసంలో మాత్రం గడపగడపకూ తిరుగుతూ సంక్రాంతి లక్ష్మిని ఆహ్వానిస్తారు.

- సన్నాయి మేళం..బసవన్నల తాళం...
- అదే వారి జీవన సంగ్రామం
- ఉప్పరపాళెం గంగిరెద్దులు ఆడించేవారి సాహసం
- పండుగ వచ్చిందంటే పల్లెలు, పట్టణాల్లో సందడి



మదనపల్లె సిటీ: మదనపల్లె పట్టణ శివారు ప్రాంతమైన అమ్మచెరువుమిట్ట వద్ద గుంటూరు జిల్లా వినుకొండ మండలం ఉప్పరపాళెంకు చెందిన గంగిరెద్దులోళ్లు 10 కుటుంబాలు గుడారాలు వేసుకుని గంగిరెద్దులను ఇంటింటా తిప్పుతుంటారు. ఉదయం లేవగానే గంగిరెద్దులను అందంగా తీర్చిదిద్దుతారు. అందరూ కలిసి జంటలుగా బయలుదేరి కాలనీలు, గ్రామాల్లో పర్యటిస్తారు. ప్రజలు ఇచ్చే డబ్బుతో గంగిరెద్దులకు, తమ కుటుంబ పోషణకు సరిపోతుందని తెలిపారు.

అంతా టైమ్ టేబుల్ ప్రకారమే....

వీరంతా ముందుగానే ఒక మండలంలో ఇన్ని రోజులుండాలని లెక్కలు వేసుకుంటారు. వారు అనుకున్నట్లుగానే అక్కడే పది రోజులు పాటు గంగిరెద్దులను ఆడిస్తారు. తరువాత మరో మండలాన్ని ఎంపిక చేసుకుంటారు. రోజూ ఐదు ఎడ్లతో పది మంది రకరకా విన్యాసాలు చేస్తూ ఇంటింటికి తిరుగుతారు. వీరు తమ గుమ్మంలోకి రావడం శుభసూచికంగా భావించే మహిళలు తోచిన విధంగా నగదు, అరిసెలు, బియ్యం, ఇతర పదార్థాలు దానం చేస్తారు. వాటితోనే వీరంతా పొట్టనింపుకుంటున్నారు.

విస్తుగొలిపే విన్యాసాలు

గంగిరెద్దులు అడించేవారి దూడా బసవన్నల విన్యాసాలు ఆశ్చర్యం కలిగిస్తాయి. ధనుర్మాసంలో ఈ హడావుడి ఎక్కువగా ఉంటుంది. పల్లెలోని గడపగడపకూ వెళ్లి ఎడ్లతో ఆటలు ఆడించడమే కాదు.. వీరు అనేక విన్యాసాలు చేయిస్తారు. ఇద్దరు సన్నాయి మేళాలతో సందడి చేస్తుంటే ఆ పదనిలకు అనుగుణంగా గంగిరెద్దులు చేసే నృత్యం అద్భుతంగా ఉంటుంది.

మహిళలూ కష్టజీవులే

ఆ కుటుంబాల్లోని ప్రతి ఒక్కరూ గంగిరెద్దుల ఆటపైనే ఆధారపడి జీవిస్తుంటారు. వీరిలో మహిళలు మాత్రం గంగిరెద్దులు గుడారాల వద్దకు వస్తే వాటికి మేత వేయడం, శుభ్రం చేయడం వంటివి చేస్తారు.

తాతల కాలం నుంచీ....



మా తాతల కాలం నుంచే ఈ సంప్రదాయాన్ని గౌరవిస్తున్నాం. ఏటా పొరుగు జిల్లాల్లో అంతటా గంగిరెద్దులను తిప్పుతాం. ఇదొక ఆచారంగా మేమంతా కలిసి పాటిస్తాం. ఇళ్ల ముంగిళ్లలో మేం చేపట్టే ప్రదర్శనల వల్ల అందరికీ శుభం కలుగుతుంది. మిగతా సమయాల్లో వ్యవసాయ పనులు చేస్తూ జీవిస్తాం. -పాపయ్య

ప్రాణాంతకమైనా తప్పదు



ఎద్దులతో మేం చేసే విన్యాసాలు ప్రాణాంతకమైనవే. తరతరాలుగా ఈ సంప్రదాయం కొనసాగుతోంది. మా పిల్లలకు వీటిపై తర్ఫీదు ఇస్తాం. వినోదం పంచే ఈ విన్యాసాలకు మంచి ప్రాధాన్యత ఉంది. రెండు, మూడు నెలల పాటు ప్రదర్శనలు ఇస్తాం. మిగిలిన రోజులు గ్రామంలో వ్యవసాయ పనులకు వెళ్తాం. -తిరుపతయ్య



మదనపల్లెలోని అమ్మచెరువుమిట్ట వద్ద గుడారాల్లో ఉన్న గంగిరెద్దులోళ్లు

క్లుప్తంగా

కారు ఢీకొని వ్యక్తికి తీవ్ర గాయాలు

మదనపల్లె : కారు ఢీకొని ఓ వ్యక్తి తీవ్రంగా గాయపడిన సంఘటన శుక్రవారం కురబలకోట మండలంలో జరిగింది. కురబలకోట బీసీ కాలనీకి చెందిన ఖాసింసాహెబ్ కుమారుడు బాబాసాహెబ్(58) వ్యక్తిగత పనులపై ద్విచక్ర వాహనంలో వెళుతుండగా, మార్గంమధ్యలోని ఏసీ గోడౌన్ వద్ద ద్విచక్రవాహనాన్ని కారు ఢీకొనడంతో బాబాసాహెబ్ తీవ్రంగా గాయపడ్డాడు. గమనించిన స్థానికులు వెంటనే 108 అంబులెన్స్ వాహనం ద్వారా మదనపల్లె ప్రభుత్వ జిల్లా ఆస్పత్రికి తరలించారు. ముదివేడు పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

జూదరుల అరెస్ట్

నిమ్మనపల్లె : పేకాట ఆడుతున్న ఐదుగురు జూదరులను అరెస్ట్ చేసినట్లు ఎస్ఐ రామకృష్ణ తెలిపారు. శుక్రవారం ముష్టూరు పంచాయతీ దిగువపల్లె వద్ద పేకాట నిర్వహిస్తున్నట్లు సమాచారంతో సిబ్బందితో కలిసి దాడి చేశామన్నారు. ఐదుగురు వ్యక్తులను అదుపులోకి తీసుకుని, వారి వద్ద నుంచి రూ.2,080 నగదు స్వాధీనం చేసుకున్నామన్నారు. నిందితులపై కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించామన్నారు.

యువతి ఆత్మహత్యాయత్నం

మదనపల్లె : ఇంట్లో తల్లిదండ్రులు మందలించారన్న మనస్తాపంతో ఓ యువతి ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన సంఘటన శుక్రవారం పట్టణంలో జరిగింది. అప్పారావువీధికి చెందిన వెంకటరమణ కుమార్తె హారిక(22)ను ఇంట్లో సమస్యలతో తల్లిదండ్రులు మందలించారు. దీంతో మనస్తాపం చెందిన హారిక విషద్రావణం తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడింది. గమనించిన కుటుంబ సభ్యులు వెంటనే ప్రభుత్వ జిల్లా ఆస్పత్రికి తరలించారు. వన్‌టౌన్ పోలీసులు కేసు విచారణ చేస్తున్నారు.

గడ్డివామి దగ్ధం

నిమ్మనపల్లె : గడ్డివామి దగ్ధమై రైతుకు తీవ్ర నష్టం వాటిల్లిన సంఘటన నిమ్మనపల్లె మండలంలో జరిగింది. రెడ్డివారిపల్లె పంచాయతీ అయ్యలవారిపల్లెకు చెందిన రైతు మొగిలీశ్వర్‌రెడ్డి ఇంటి వద్ద పశువుల కోసం వరిగడ్డిని వామివేసి ఉంచారు. శుక్రవారం ప్రమాదవశాత్తు గడ్డివామికి నిప్పంటుకుని మంటలు చెలరేగాయి. ఇది గమనించిన స్థానికులు మంటలను అదుపులోకి తెచ్చేందుకు శ్రమించగా.. అప్పటికే గడ్డివామి కాలిపోయింది. సుమారు రూ.1లక్ష రూపాయల విలువ కలిగిన ఐదు ట్రాక్టర్ల లోడు కలిగిన గడ్డివామి కాలిపోవడంతో రైతు కుటుంబానికి తీవ్రనష్టం వాటిల్లింది. రెవెన్యూ అధికారులకు సమాచారం అందించారు.

పండుగకు వెళ్తూ.. పైలోకాలకు..


సంఘటన స్థలంలో మృతదేహాలు


నుజ్జునుజ్జయిన ఆటో

- రోడ్డు ప్రమాదంలో నవదంపతుల మృతి
- ఢీకొన్న ఆటో, లారీ


భార్గవ్, లక్ష్మీదేవి (ఫైల్)

రైల్వేకోడూరు అర్బన్ : పెళ్లయిన ఆరు నెలలకే నవదంపతుల జీవితం అర్ధాంతరంగా ముగిసింది. వారు పండుగకు వెళ్తూ పైలోకాలకు వెళ్లారు. తన భార్యను పుట్టింటికి తీసుకెళ్తుండగా.. జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇద్దరూ మృత్యువాత పడ్డారు. పోలీసులు తెలిపిన మేరకు వివరాలు ఇలా ఉన్నాయి. రైల్వేకోడూరు మండలంలోని ఉర్లగడ్డపోడు వైఎస్సార్ ఎస్సీ కాలనీకి చెందిన ఉదయగిరి భార్గవ్(24) ఆరు నెలల క్రితం రాజంపేట బలిజపల్లికి చెందిన లక్ష్మీదేవి(22)ని వివాహం చేసుకున్నాడు. వారి దాంపత్య జీవితం అన్యోన్యంగా కొనసాగింది. తమ సొంత కాళ్లపై నిలబడటానికి నెల రోజుల క్రితం ఆటోను కొనుగోలు చేసి జీవనం సాగించే వారు. సంక్రాంతి పండుగకు రాజంపేటలోని బలిజపల్లిలో అత్తగారి ఇంటికి వెళ్తుండగా శుక్రవారం సొంత ఆటోలో బయలుదేరారు. రైల్వేకోడూరు మండలంలోని రాఘవరాజుపురం, నల్లరాళ్లమిట్ట వద్ద ప్రధాన రహదారిలో ఆటోను ఎదురుగా వస్తున్న లారీ ఢీకొంది. ఈ ప్రమాదంలో భార్గవ్, లక్ష్మీదేవి అక్కడికక్కడే మృతి చెందారు. ఆటో నుజ్జునుజ్జు అయ్యింది. దంపతులిద్దరూ ఉన్నపలంగా మృతి చెందడంతో ఇరువురి గ్రామాలలో విషాదఛాయలు అలుముకున్నాయి. నిండు నూరేళ్ల దాంపత్య జీవితం పిల్లాపాపలతో అనుభవించాల్సిన వారు.. ఇలా అర్ధాంతరంగా చనిపోవడంతో కుటుంబ సభ్యులు, బంధువులు శోకసంద్రంలో మునిగిపోయారు. వారు గుండెలవిసేలా రోదించారు. సంఘటన స్థలంలో ట్రాఫిక్ స్తంభించిపోయింది. సీఐ మధుసూదన్ రెడ్డి, ఎస్ఐ డాక్టర్ నాయక్ వెంటనే అక్కడికి చేరుకొని ట్రాఫిక్‌కు అంతరాయాన్ని తొలగించారు. మృతదేహాలను పోస్టుమార్టం నిమిత్తం రాజంపేట ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నారు.

బాధిత కుటుంబానికి కొరముట్ల భరోసా

రోడ్డు ప్రమాదం జరిగిన విషయం తెలుసుకున్న ప్రభుత్వ విప్ కొరముట్ల శ్రీనివాసులు వెంటనే అక్కడికి చేరుకున్నారు. మృతదేహాలను పరిశీలించి, మృతుడు భార్గవ్ కుటుంబానికి భరోసా కల్పించారు. దహన సంస్కారాల ఖర్చులకు ఆర్థిక సాయం అందించారు. ప్రభుత్వం, పార్టీ తరఫున అన్ని విధాలా ఆదుకుంటామన్నారు. ప్రభుత్వ విప్ వెంట నాయకులు కొరెడ్డి సిద్దయ్య, సర్పంచ్ గోపి తదితరులు ఉన్నారు.

హ్యాండ్ బాల్ పోటీలు ప్రారంభం


క్రీడాకారులతో నిర్వాహకులు, కోచ్‌లు

రాజంపేట : మండల పరిధి తాళ్ళపాక రోడ్డులోని శాన్వీ ఇంటర్నేషనల్ పాఠశాలలో 45వ రాష్ట్ర స్థాయి బాలికల అండర్–19 హ్యాండ్ బాల్ పోటీలు శుక్రవారం ప్రారంభించారు. మాజీ మంత్రి, రాజంపేట మాజీ శాసనసభ్యుడు పసుపులేటి బ్రహ్మయ్య 67వ జయంతి సందర్భంగా అయన కుమారులైన హ్యాండ్ బాల్ అసోసియేషన్ చైర్మన్ పసుపులేటి వీర ప్రదీప్‌కుమార్, ఆర్గనైజ్ సెక్రటరీ వీర పవన్‌కుమార్‌లు పసుపులేటి ఫౌండేషన్ ట్రస్టు ఆధ్వర్యంలో ఈ పోటీలు ఏర్పాటు చేశారు. రాష్ట్రంలోని 12 జిల్లాలకు చెందిన క్రీడాకారులు హాజరయ్యారు. వీరందరికీ పసుపులేటి ఫౌండేషన్ ట్రస్టు ఆధ్వర్యంలో శాన్వీ పాఠశాలలో భోజన వసతులు కల్పించారు. అనంతరం వారు క్రీడాకారులను పరిచయం చేసుకొని క్రీడా దుస్తులను అందజేశారు. స్టేట్ సెక్రటరీ శ్రీనివాస్, జిల్లా కార్యదర్శి లక్ష్మణ్, రాష్ట్ర ఆర్గనైజ్ సెక్రటరీ రామాంజనేయులు, టెక్నికల్ కమిటీ చైర్మన్ చంద్రశేఖర్ రావు, రిఫ్రిన్ బోర్డు చైర్మన్ ఎం.సురేష్ కుమార్ ఆధ్వర్యంలో పోటీలు నిర్వహించారు. ఉత్తమ ప్రతిభ కనబరిచిన క్రీడాకారులను ఆంధ్రప్రదేశ్ జట్టుకు ఎంపిక చేస్తారు. వారు బీహార్ రాష్ట్రంలో ఈ నెల 27వ తేదీ నుంచి 31 వరకు జాతీయ స్థాయిలో నిర్వహించే పోటీలలో పాల్గొనాల్సి ఉంటుంది. ఈ కార్యక్రమంలో పాఠశాల డైరెక్టర్ కొండూరు భరత్ కుమార్‌రాజు, ప్రిన్సిపాల్ విజయనిర్మల, సిగ జయరాం, శ్రీనిధి ప్రభాకర్ తదితరులు పాల్గొన్నారు.



ఒక్క రోజులోనే ధ్రువపత్రాలు



గతంలో ఏవైనా ధ్రువపత్రాలు కావాలంటే మీ సేవలో దరఖాస్తు చేసుకుని కార్యాలయాలు, మీ సేవ కేంద్రాల చుట్టూ తిరగాల్సి వచ్చేది. అయినా సకాలంలో ధ్రువపత్రాలు అందేవికావు. జగనన్న సురక్ష కార్యక్రమంలో మా పిల్లలకు కుల, ఆదాయ ధ్రువపత్రాలు కావాలని గ్రామ వలంటీరుకు తెలపడం జరిగింది. ఒక్క రోజులోనే మా ఇంటి వద్దకు ధ్రువపత్రాలు తెచ్చి ఇచ్చారు. ప్రభుత్వ సేవలు ఇంత సులభతరం చేసిన సీఎం జగన్‌మోహన్‌రెడ్డికి రుణపడి ఉంటాం.

– ఎ.లత, బోడుమల్లువారిపల్లె, పీలేరు మండలం

కార్పొరేట్ దీటుగా ప్రభుత్వవిద్య



జగనన్న ప్రభుత్వం కార్పొరేటుకు దీటుగా ప్రభుత్వ విద్యను అందిస్తోంది. వేలకోట్లు ఖర్చు చేసి పాఠశాలలకు నూతన భవనాల నిర్మాణం, మౌలిక వసతులు ఏర్పాటు చేశారు. విద్యార్థులకు ఉచితంగా అందజేసిన పుస్తకాల క్వాలిటీ బాగుంది. విద్యార్థులకు అందజేస్తున్న ట్యాబులు ఎంతో ఉపయోగపడుతున్నాయి. ప్రభుత్వ విద్యను బలోపేతం చేయడానికి అమ్మఒడి ఎంతో ఉపయోగపడుతోంది.

– వి.శ్రీనివాసులు, ప్రధానోపాధ్యాయుడు, దూళ్ళవారిపల్లె, రాయచోటి

నెరవేరిన సొంతింటి కల



మేము నిరుపేదలం. ఇంటి కోసం గత ప్రభుత్వ హయాంలో దరఖాస్తు చేసుకున్నా మంజూరు కాలేదు. నవరత్నాల్లో భాగంగా జగనన్న ప్రభుత్వం ఇల్లు లేని వారికి ఇల్లు మంజూరు చేయడంతో వెంటనే నిర్మాణ పనులు పూర్తి చేసుకున్నాం. ఎట్టకేలకు మా సొంతింటి కల నెరవేరింది. మా పిల్లలకు అమ్మఒడి పడుతోంది. సీఎం జగన్‌మోహన్‌రెడ్డికి మేము ఎప్పటికీ రుణపడి ఉంటాం. రాబోయే ఎన్నికల్లో సీఎంగా జగనన్నే ఉండాలి.

– కోవెలకుంట్ల వరలక్ష్మి, కాలువపల్లె, గోపవరం మండలం

దుకాణాలపై విజిలెన్స్ దాడులు


తనిఖీ చేస్తున్న అధికారులు

రైల్వేకోడూరు అర్బన్ : రైల్వేకోడూరులో దుకాణాలపై రీజినల్ విజిలెన్స్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు శుక్రవారం దాడులు నిర్వహించారు. పట్టణంలోని పద్మప్రియ జనరల్ స్టోర్స్, లక్ష్మీ నరసింహ, ఎంవీఎస్ జనరల్ స్టోర్స్‌లపై దాడులు చేసి, సరుకులను తనిఖీ చేపట్టారు. తయారీ, గడువు తేదీలు, సరుకుల నాణ్యత, తూకాల తేడాలు వంటి వాటిపై మూడు కేసులు నమోదు చేసి, రూ.50 వేల అపరాధ రుసుం విధించారు. ఈ దాడుల్లో అధికారులు రెడ్డప్ప, బాలగంగాధర్‌రెడ్డి, రవీంద్రారెడ్డి, రెడ్డి ప్రసాద్, సుదర్శన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

కళాశాలలో సంక్రాంతి సంబరాలు



ఏఐటీఎస్‌లో జరిగిన వేడుకలో పాల్గొన్న విద్యార్థులు

రాజంపేట : అన్నమాచార్య ఇంజనీరింగ్ కళాశాలలో శుక్రవారం సంక్రాంతి సంబరాలు కళాశాల వైస్ చైర్మన్ చొప్పా ఎల్లారెడ్డి, ప్రిన్సిపాల్ డాక్టర్ ఎస్ఎంవీ నారాయణల ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ కార్యక్రమంలో భాగంగా విద్యార్థులకు ముగ్గులు (రంగోలి) పోటీలు, సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించి గెలుపొందిన విద్యార్థులకు వారు బహుమతులు ప్రదానం చేశారు. విద్యార్థులందరూ సాంప్రదాయ దుస్తులను ధరించి వేడుకలలో పాల్గొన్నారు. అనంతరం వారు సంక్రాంతి పండుగ విశిష్టత గురించి విద్యార్థులకు వివరించారు. కళాశాల యాజమాన్యం, అధ్యాపకుల బృందం విద్యార్థులకు సంక్రాంతి శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో డీన్ ఆఫ్ స్టూడెంట్స్ డాక్టర్ ఎం.సుబ్బారావు, పరిపాలన అధికారి ఎస్.సుబ్బారెడ్డి, ఫిజికల్ డైరెక్టర్ డాక్టర్ బి.నాగముని, డీన్స్, వివిధ విభాగాల హెచ్‌ఓడీలు, అధ్యాపకులు, అధ్యాపకేతర సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

భద్రకాళి అమ్మవారికి రాహుకాల పూజలు


అలంకరణలో భద్రకాళి అమ్మవారు

రాయచోటి టౌన్ : రాయచోటి శ్రీ భద్రకాళి అమ్మవారికి రాహుకాల పూజలు అత్యంత భక్తి శ్రద్ధలతో నిర్వహించారు. శుక్రవారం ఆలయ పాలక మండలి అధ్యక్షురాలు పోలంరెడ్డి విజయ, ఆలయ ఈఓ డివి రమణారెడ్డి, మున్సిపల్ వైస్ చైర్మన్ పోలం రెడ్డి దశరథరామిరెడ్డిల ఆధ్వర్యంలో ఆలయ ప్రధాన అర్చకులు అమ్మవారికి ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. అనంతరం పూలు, పట్టు వస్త్రాలు, బంగారు ఆభరణాలతో పాటు నిమ్మకాయలతో హారాలతో అమ్మవారిని అలంకరించి భక్తులకు దర్శన ఏర్పాటు చేశారు.

బీఆర్ అంబేడ్కర్ సేవలు మరువలేనివి

పుల్లంపేట : డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ దేశానికి చేసిన సేవలు మరువలేనివని వత్తలూరు ఉప సర్పంచ్ ఎం.శంకర్ రెడ్డి కొనియాడారు. శుక్రవారం వత్తలూరు గ్రామ పంచాయతీలోని హరిజనవాడలో డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ సామాజిక న్యాయ మహాశిల్పం సంతకాల సేకరణలో భాగంగా వత్తలూరు సచివాలయ సిబ్బంది, గ్రామ ప్రజల సహకారంతో సంతకాలు సేకరణ నిర్వహించారు. ఈనెల 19న విజయవాడలో 108 అడుగుల అంబేడ్కర్ భారీ విగ్రహాన్ని ఏర్పాటు చేయనున్నారు. ఇందులో భాగంగా ప్రతి గ్రామ పంచాయతీలో సంతకాలు సేకరణ కార్యక్రమం నిర్వహించారు.

భూ ఆక్రమణదారులపై చర్యలు తీసుకోండి

గాలివీడు : ప్రభుత్వ భూముల ఆక్రమణదారులపై తక్షణమే శాఖపరమైన చర్యలు తీసుకోవాలని కరిమిరెడ్డిగారిపల్లె గ్రామస్తులు మండల తహసీల్దార్ దైవాదీనంను కోరారు. శుక్రవారం మండల కేంద్రంలోని రెవెన్యూ కార్యాలయంలో తహసీల్దార్‌ను గ్రామస్తులు కలిసి ప్రభుత్వ భూముల ఆక్రమణపై వినతి పత్రంను అందించారు. సర్వేనెంబరు 1762లో ప్రభుత్వం పట్టాలను మంజూరు చేసి భూమిని గిరిజనులకు కేటాయించగా అందులో అగ్రకులాకు చెందిన పలువురు ఆక్రమించుకున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ విషయాన్ని పలుమార్లు అధికారులకు దృష్టికి తీసుకెళ్లిన ఫలితం లేదని, అదే గ్రామంలోని అగ్రకులానికి చెందిన ఓ పెత్తందారు చేతుల్లో సర్వేనెంబరు 1757, 1758లో కొంత భూమిని ఆక్రమించి కంచెను సైతం ఏర్పాటు చేస్తున్నట్లు ఆరోపించారు. ఆక్రమణకు గురైన ప్రభుత్వ భూమిలో అర్హులైన స్థానిక గిరిజన కుటుంబాలకు, గతంలో భూమిని కోల్పోయిన బాధితులకు కేటాయించాలని వినతిపత్రంలో గ్రామస్తులు కోరారు.

అంతర్‌రాష్ట్ర దొంగల ముఠా అరెస్ట్

కలకడ : అంతర్ రాష్ట్ర దొంగల ముఠాను పోలీసులు అరెస్ట్ చేశారు. వారి నుంచి రూ.4.26 లక్షల విలువైన బంగారు ఆభరణాలు స్వాధీనం చేసుకున్నారు. స్థానిక పోలీస్‌స్టేషన్‌లో శుక్రవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో రాయచోటి డీఎస్పీ మహబూబ్‌బాషా వివరాలు వెల్లడించారు. కర్ణాటక రాష్ట్రం కోలారు తాలూకాకు చెందిన చెందిన రామప్ప కుమారుడు వెంకటేష్, మునియప్ప కుమారుడు చంద్రశేఖర్(శేఖర్), ముద్దప్ప కుమారుడు నారాయణస్వామి కలిసి అన్నమయ్య, తిరుపతి జిల్లాలలోని బంగారు దుకాణాలలో కొనుగోలు చేసే వ్యక్తులుగా వెళ్లి.. చోరీకి పాల్పడే వారు. జూదాలు, చెడు అలవాట్లకు బానిసలై.. వాటి ఖర్చుల కోసం దొంగతనాలు చేసే వారు. 2023 ఆగస్టు 10న కలకడ టౌన్‌లోని ఎస్‌జేబీ బంగారు నగల షాపులో యజమానికి మాయమాటలు చెప్పి ఏమార్చి.. ఒక గొలుసు, ఒక ఉంగరం చోరీ చేశారు. అదే విధంగా తిరుపతి జిల్లా శ్రీకాళహస్తి, అన్నమయ్య జిల్లా పెద్దతిప్పసముద్రం, రాయచోటి టౌన్‌లలోని పోలీస్‌స్టేషన్‌ల పరిధిలో నాలుగు బంగారు గొలుసులు, ఒక ఉంగరం చోరీ చేశారు. శుక్రవారం కలకడ వారపు సంతలో అనుమానితులుగా ఉన్న వీరిని కలకడ సీఐ నాగేంద్ర సూచనల మేరకు ఎస్ఐ తిప్పేస్వామి తన సిబ్బందితో వెళ్లి పట్టుకున్నారు. వారి వద్ద నుంచి 71 గ్రాముల బంగారు నగలు స్వాధీనం చేసుకున్నారు. నిందితులను అరెస్ట్ చేసి, కేసు నమోదు చేసి, కోర్టుకు హాజరు పరిచారు.

హత్య కేసులో నిందితుడి అరెస్ట్

రైల్వేకోడూరు : ఓబులవారిపల్లె మండల కేంద్రంలోని మర్రిచెట్టు వద్ద ఈ నెల 10వ తేదీన కటికం చెంగయ్య (47)ను హత్య చేసిన నిందితుడిని శుక్రవారం అరెస్ట్ చేశారు. రైల్వేకోడూరు పోలీస్‌స్టేషన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో సీఐ మధుసూదన్‌రెడ్డి వివరాలు వెల్లడించారు. టీ షాపు వద్ద చెంగయ్య నిలబడి ఉండగా శివశంకరాపురం గ్రామానికి చెందిన మాదం సిద్దు అలియాస్ సిద్దయ్య మచ్చు కత్తితో నరికి చంపాడని తెలిపారు. ఈ కేసులో చిన్నఓరంపాడు జీత్ పంజాబీ డాబా వద్ద ఎం. సిద్దయ్యను అదుపులోకి తీసుకున్నామని తెలిపారు. అతనికి సహకరించిన శివశంకరాపురం గ్రామానికి చెందిన అరిగెల వెంకటయ్యను కూడా అదుపులోకి తీసుకున్నట్లు తెలిపారు. మృతుడి అన్న వెంకట సుబ్బయ్య ఇచ్చిన ఫిర్యాదు మేరకు హత్యానేరం కింద కేసు నమోదు చేసి, నిందితులను కోర్టుకు హాజరుపరిచినట్లు పేర్కొన్నారు. విలేకరుల సమావేశంలో ఎస్ఐ శ్రీకాంత్‌రెడ్డి, హెడ్ కానిస్టేబుల్ వల్లి, కానిస్టేబుల్ వెంకటయ్య తదితరులు పాల్గొన్నారు.

ప్రతి పండుగకు ఒక విశిష్టత

రాయచోటి అర్బన్ : భారతీయ పండుగలకు ఒక ప్రత్యేక విశిష్టత ఉందని డీఎస్పీ మహబూబ్‌బాషా, వీఆర్ విద్యాసంస్థల అధినేత వెంకట్రామిరెడ్డి, సాయి ఇంజనీరింగ్ కళాశాల ఏడీ సుధాకర్‌రెడ్డిలు అన్నారు. శనివారం సాయి కళాశాలలో వివేకానంద జయంతితోపాటు ముందస్తు సంక్రాంతి సంబరాలను నిర్వహించారు. రంగవల్లి పోటీలు, కోలాటం, ఉట్టి కొట్టడం, భోగి మంటలు, సాంప్రదాయక ఆటల పోటీలను నిర్వహించి కళాశాల ఆవరణలో తెలుగుదనాన్ని ప్రతిబింబించే కళా రూపాలను యువతకు పరిచయం చేశారు.

సీఎంఆర్ఎఫ్ చెక్కుల పంపిణీ


చెక్కును అందజేస్తున్న ఎంపీపీ గాలివీటి

వీరబల్లె (రాయచోటి టౌన్) : మండల పరిధిలోని వివిధ గ్రామాలకు చెందిన వారికి ముఖ్యమంత్రి సహాయ నిధి చెక్కులు ఎంపీపీ గాలివీటి రాజేంద్రనాథరెడ్డి అందజేశారు. శుక్రవారం మండల పరిషత్ కార్యాలయంలో ఈ చెక్కులను వారికి అందజేశారు. మండలంలోని బస్సిగాళ్ల వెంకటరమణకు రూ.4,75,000లు, టెంకాయచెట్లపల్లె ఎర్రకాలువ రెడ్డెయ్యకు రూ.1,80,000లు, అలాగే మాచిరెడ్డి రెడ్డెప్పరెడ్డికి రూ.1,80,000లు, గడికోట గ్రామం సీకే రామ్మోహన్ రాజుకు రూ. 85,000లు, గుర్రప్పగారిపల్లె మూడిళ్లపల్లెకు చెందిన రమేష్ నాయుడుకు రూ.50,000లు, అదే గ్రామానికి చెందిన రామలక్ష్మమ్మకు రూ. 24,000లు ఉన్నారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీ మల్లీశ్వరి, వైఎస్సార్ సీపీ నాయుకులు పాల్గొన్నారు.

ముద్రపల్లెలో జగనన్న ఆరోగ్య సురక్ష

పెనగలూరు (ఓబులవారిపల్లె) : ముద్రపల్లె పంచాయతీలో జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం శుక్రవారం స్థానిక సర్పంచ్ శివయ్య నాయుడు ప్రారంభించారు. సర్పంచ్ మాట్లాడుతూ ఆరోగ్య సురక్ష కార్యక్రమానికి ప్రత్యేకంగా డాక్టర్లు వచ్చి ఏడు రకాల పరీక్షలు నిర్వహించి మందులను ఉచితంగా పంపిణీ చేసి అవసరమైన చికిత్స కోసం కార్పొరేట్ ఆసుపత్రికి తరలించి ఆరోగ్యశ్రీ ద్వారా ఉచితంగా వైద్య సేవలు అందించడం జరుగుతుందన్నారు. అవకాశాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు. కార్యక్రమంలో డాక్టర్ తౌసిఫ్, ఏఓ పద్మభూషన్ రెడ్డి, వైద్యులు పాల్గొన్నారు.

రామయ్య సన్నిధిలో గడికోట


రామయ్య సన్నిధిలో కుటుంబ సమేతంగా ఎమ్మెల్యే శ్రీకాంత్‌రెడ్డి

ఒంటిమిట్ట : ఆంధ్ర భద్రాద్రిగా విరాజిల్లుతున్న ఒంటిమిట్ట శ్రీ కోదండ రామాలయంలో ఏకశిలపై వెలసిన సీతారామలక్ష్మణులను శుక్రవారం రాయచోటి ఎమ్మెల్యే గడికోట శ్రీకాంత్‌రెడ్డి కుటుంబ సమేతంగా దర్శించుకున్నారు. ఈ సందర్భంగా ఆలయ లాంఛనాలతో వారికి స్వాగతం పలికి, ఆలయ ప్రదక్షిణ గావించి, గర్భాలయంలోని మూల విరాట్‌కి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం వారు రంగమండపంలో సేదతీరి, స్వామి వారి తీర్థప్రసాదాలను స్వీకరించారు.

దోస, బొప్పాయిలో తెగుళ్ల నివారణ చేపట్టండి

ఓబులవారిపల్లె : దోస, బొప్పాయి పండ్ల తోటల్లో తెగుళ్ల సోకడం జరిగిందని, నివారణ చర్యలు చేపట్టాలని అనంతరాజుపేట వైఎస్సార్ ఉద్యాన కళాశాల ఆచార్యులు డాక్టర్ సీహెచ్ రూత్, డాక్టర్ స్వరాజ్య లక్ష్మిలు పేర్కొన్నారు. శుక్రవారం వైకోట గ్రామంలోని పంట పొలాల్లో తెగుళ్ల నివారణపై రైతులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా వారు రైతులతో మాట్లాడుతూ ఇటీవల కురిసిన అకాల వర్షాలకు దోస పంటలో బంకమాడు తెగులు సోకినట్లు గుర్తించామన్నారు. గోధుమ రంగు మచ్చలు ఆకులపై వచ్చి బంకలా ఏర్పడుతుందన్నారు. నివారణకు మాంకోజెబ్ 3 గ్రాములు లేదా, ప్రొఫినబ్ 2.5 గ్రాములు చల్లి నివారించాలన్నారు. బొప్పాయిలో తెగుళ్ల నివారణకు రైతులకు పలు సూచనలు, సలహాలు ఇచ్చారు. కార్యక్రమంలో గ్రామాల రైతులు, తదితరులు పాల్గొన్నారు.